క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ


కిట్లు తీసుకెళుతున్న ప్రధానోపాధ్యాయులు

కూడేరు: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం మండలానికి సరఫరా చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం ఎంఈఓ చంద్రశేఖర్ ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు ఉండాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కిట్లు పంపిణీ చేశామన్నారు.

రెండో ఉపాధ్యక్షుడి ఎన్నిక రేపు

విడపనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు రెండో ఉపాధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీటీసీలు, తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

వైకేపీ ఏపీఎంగా రామ్మూర్తి




కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్ క్రాంతి పథకం (డీఆర్‌డీఏ) ఏపీఎంగా ఎస్.రామ్మూర్తి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గుంతకల్లు నుంచి ఆయన బదిలీపై కళ్యాణదుర్గానికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మంజుల అనంతపురంలోని హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు తీసుకున్న అనంతరం సీసీలు, యానిమేటర్లతో ఏపీఎం సమావేశమయ్యారు. మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఏపీఎం రాజశేఖర్

కూడేరు: వైకేపీ మండల ఏపీఎంగా రాజశేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తాడిపత్రి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం మధుసూదన్ గుప్తా బదిలీపై గుమ్మఘట్ట మండలానికి వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం రాజశేఖర్ విలేకరులతో మాట్లాడారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రేపటి నుంచి ఉరుసు


అలంకరణలో రోషన్ షా వలి సమాధి

కళ్యాణదుర్గం: పట్టణంలో వెలసిన హజరత్ సయ్యద్ జలాలి రోషన్ షా వలి ఉరుసు ఈ నెల 8 నుంచి ప్రారంభమవుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 8న గంధం, 9న షంషీర్, 10న ఉరుసు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 8వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు రోషన్‌వలి పీర్ల మకానం నుంచి పక్కీర్ల జల్సాతో పురవీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఘనంగా దీపారాధన


అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని కల్‌హోళ గ్రామంలో షాబాజ్ దీవాన్ వలీ ఉరుసు మహోత్సవం సందర్భంగా మంగళవారం దీపారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకులు , మత గురువులు స్వామి దర్గాకు ఊరేగింపుగా వెళ్లి దీపారాధన చేశారు. ఈ సందర్భంగా స్వామికి దివ్వెలతో కొబ్బరి వేసి మొక్కులను తీర్చుకున్నారు. హిందూ ముస్లింలు పెద్ద ఎత్తున దర్గాను దర్శించుకున్నారు. బుధవారం షాబాజ్ దీవాన్ వలి ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, మాళాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నాలుగు రోజు కిందట భారీ గాలీవానకు పలు విద్యుత్ స్తంభాలు పడిపోయి, కరెంట తీగలు తెగిపోయాయి. వెంటనే పునరుద్ధరణ చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదేశించడంతో విద్యుత్ ఏఈ సత్యం తన సిబ్బందితో రెండు రోజులుగా మరమ్మతు చేసి మంగళవారం కరెంట్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్, తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించేలా కృషిచేసిన ఎమ్మెల్సీకి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వరి కొయ్యకు నిప్పు.. భూసారానికి ముప్పు

- అవగాహన లోపంతో గడ్డి కొయ్యలను కాల్చేస్తున్న రైతులు
- కలియదున్నితేనే ప్రయోజనమంటున్న వ్యవసాయాధికారులు


ఆయకట్టులో వరి కొయ్యలు కాలుస్తున్న దృశ్యం

రాయదుర్గం: వ్యవసాయంలో కూలీల కొరత అధిగమించేందుకు యంత్రాల వినియోగం ఎక్కువైంది. నేల దుక్కి మొదలు పంటకోత వరకు అధిక మంది రైతులు యంత్ర సాయంతోనే పనులు పూర్తిచేస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో గడ్డి వినియోగం క్రమంగా తగ్గింది. పశు సంపద ఉన్న వారు మాత్రమే కోత గడ్డిని సేకరిస్తు కుప్పలేసుకుంటున్నారు. మిగిలిన వారు పొలాల్లోనే వదిలిపెట్టేస్తున్నారు. ఖరీఫ్‌లో తదుపరి పంటలకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలు నాగలికి అడ్డంకిగా మారి దుక్కిలో ఎక్కువ సమయం తీసుకుంటుందనే ఉద్దేశ్యంతో వరి కొయ్యలతో పాటు గడ్డికి నిప్పు పెట్టి బూడిద చేస్తున్నారు. అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. రాయదుర్గం డివిజన్‌లోని ఐదు మండలాల్లో హెచ్‌ఎల్‌సీ తో పాటు బీటీపీ ఆయకట్టు లో రబీలో 2,130 హెక్టార్లలో వరి పంటలు కొతకొచ్చాయి. వారంతా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కలియదున్నితేనే ప్రయోజనం

- వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్ఫెట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకూ తగ్గుతుంది.
- కలియ దున్నితే ఎకరాకు సుమారు టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు అంది పంటలకు మేలు చేకూరుతాయి.
- నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.
- టన్ను గడ్డి కావాలంటే వరి పెరుగుదలకు 18.9 కిలోల పొటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1 కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరం కానున్నాయి. కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి.
- పొలం దున్నే పది రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్‌పాస్ఫెట్ చల్లాలి. దీంతో భూమి దెబ్బ తినడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి దిగుబడి అవకాశాలు మెరుగుపడుతాయి.

నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాలు..

- వరి కొయ్యలు కాల్చడం వల్ల కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో భూమి సారవంతం కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గిపోతుంది.
- భూమికి పీచు పదార్థాంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగిసలు, ఉడములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బ తింటుంది.
- గట్లు పై ఉన్న పచ్చనిచెట్లు కూడా ఒక్కోసారి బుగ్గిపాలవుతాయి. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాలు దగ్గర ఉంటే ధాన్యం కాలిపోయే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి

వరి కోతలు పూర్తి చేసిన రైతులు కొయ్యలకు నిప్పుపెట్టడం మానుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తేనే నేలలో సారవంత కాపాడుకోవచ్చు. దీనిపై క్షేత్రస్థాయిలోని ఆర్‌బీకే సిబ్బంది ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తాం. వారి సూచనలను ప్రతి రైతూ తప్పక పాటించేలా చర్యలు చేపడతాం.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

వైభవంగా కొల్లాపురి మహాలక్ష్మీదేవి రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురంలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మీ దేవి ఆలయంలో మంగళవారం 19వ వార్షికోత్సవం సందర్భంగా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయాన్నే గంగజలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి అభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయనికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేలాది మంది భక్తుల నడుమ ప్రత్యేకంగా అలకరించిన రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి రథోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు నిఖిల్‌రెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు దర్గన్న, జయరాంరెడ్డి, జి. నాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం .. చంద్రబాబు అబద్ధం

- 'గడప గడప'లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

డి హీరేహాళ్ (రాయదుర్గం): మాటిస్తే .. నిలబెట్టుకుంటాడనే నమ్మకం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో ఉంటే.. అబద్ధాలు చెప్పి వంచనకు గురిచేసే నైజం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. డి హీరేహాళ్ మండలంలోని లక్ష్మీపురం, లింగమనహళ్లిలో మంగళవారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి తో కలసి విప్ ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. మంచిచేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విప్ కాపు విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు అధికారం కోసం 610 హామీలిచ్చి ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. మళ్లీ ఎన్నికలు దగ్గరపడే కొద్ది ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు మాయల ఫకీరు వేషం ధరించడాడని దుయ్యబట్టాడు. బాబుకు వయసు మీద పడడటం, పప్పు ఇష్టానుసారంగా మాట్లాడడం చూస్తే 2024 ఎన్నికల తర్వాత టీడీపీని ప్రజలు శ్యాశ్వతంగా బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2014లో అధికారం ఇస్తే దోపిడికే పెద్దపీట వేసిన ఈ ద్రోహులు మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకొస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. టీడీపీ వస్తే అమ్మఒడి, ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యాకానుక, రైతుభరోసా, సున్నావడ్డీ, కాపునేస్తం, నేతన్న నేస్తం , జగనన్నతోడు లాంటి పథకాలు దూరమైపోతాయన్నారు. ఇప్పటికే వాలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ రద్దుచేస్తామంటూ ఓ మురికి కాలువ చెప్పిన మాటలు ప్రజలెవ్వరు మరచిపోవద్దన్నారు. జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు.

అభివృద్ధి 'కాలవ'లో కొట్టుకుపోయింది..

టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులకు 2014లో పొరపాటున ఓటు వేసినందుకుకు 40 ఏళ్ల అభివృద్ధి కాలువలో కొట్టుకుపోయినట్టుందని విప్ కాపు ధ్వజమెత్తారు. జన్మభూమి కమిటీలు పెట్టి సర్వం దోచేశారన్నారు. ఇసుక నుంచి మట్టి వరకూ ఆఖరకు మరుగుదొడ్లను సైతం పచ్చ నాయకులు వదలేదన్నారు. అలాంటి వారి మామ మాటలు నమ్మితే మనగోతి మనమే తవ్వుకున్నట్ల వుతుందన్నారు. కాలవ పుణ్యానా ఆనాటి రూ.40 కోట్ల విద్యుత్ బకాయిలను సైతం మనం చెల్లించామంటే వారి అభివృద్దేంటో అర్థం చేసుకోవాలన్నారు. గడప గడపలోనూ వస్తున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మడేనహళ్లి సర్పంచ్ భీమప్ప, ఎంపీటీసీ గంగమ్మ, మండల నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పెండింగ్ పంటల బీమా విడుదల చేయండి


మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: నియోజకవర్గంలోని రైతులకు పెండింగ్‌లో ఉన్న పంటల బీమాను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం తాడేపల్లిలోని వ్యవసాయ మంత్రి కార్యాలయంలో మంత్రిను ఆయన కలిశారు. ఈసందర్భంగా 2021కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బీమా అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వీరన్న, రైతు సంఘం నాయకుడు పెద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.

బాధితులకు తక్షణ సాయం అందజేత

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి గ్రామంలో రమేష్(30) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా కింద రూ. 10 వేలు తక్షణసాయం అందించారు. మిగిలిన రూ.90 వేలు నామినీ ఖాతాలో జమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, మాజీ ఎంపీటీసీ పోలేపల్లి లోకేష్, నాయకులు మంజునాథ, శరణప్ప , ఈశ్వర , పంచాయతీ కార్యదర్శి సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని గుండ్లపల్లిలో శనివారం గుండెపోటుతో మృతి చెందిన మాల ఆనంద్(43) కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణసాయం రూ.10,000ను వైస్ ఎంపీపీ రేఖమ్మ, సర్పంచ్ పురుషోత్తంలతో కలసి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అమర్‌నాథ్ మృతుని భార్య లక్ష్మిదేవికి మంగళవారం అందించారు. మిగిలిన మొత్తం త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాకు జమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ మహేష్, పంచాయతీ కార్యదర్శి అశోక్, వలంటీర్ రమేష్ పాల్గొన్నారు.

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని హెచ్ సిద్ధాపురంలో ఇటీవల వివాహిత బెలగల్ లక్ష్మి (48) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భర్త హనుమయ్యకు మంగళవారం వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల నగదును సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి అందజేశారు. మిగిలిన రూ.90 వేల త్వరలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కాగా సాంకేతిక సమస్యలు పరిష్కరించి వైఎస్సార్ బీమా మంజూరయ్యేలా కృషి చేసిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు


ఆముదం విత్తనాలు మొలకెత్తని పొలాన్ని చూపుతున్న రైతు శ్రీరాములు

బొమ్మనహాళ్: నకిలీ ఆముదం విత్తనాలతో రైతు నట్టేట మునిగాడు. రూ. వేలల్లో పెట్టిన పెట్టుబడి మట్టిపాలు కావడంతో గగ్గోలు పెడుతున్నాడు. దర్గాహొన్నూరుకు చెందిన రైతు శ్రీరాములు అనంతపురంలోని శ్రావణి ఎంటర్ ప్రైజెస్ దుకాణంలోని డీలర్ వద్ద ఆముదం పంట విత్తనాలను (ఎంఆర్‌సీఏ 410 హైబ్రిడ్) కోనుగోలు చేశాడు. కిలో ప్యాకెట్ రూ. 430 ప్రకారం 15 ఎకరాలకు 30 ప్యాకెట్లు విత్తనాలను కోనుగోలు చేశాడు. విత్తనాలు కూలీలకు, సేద్యం పనులకు మొత్తంగా రూ. 70 వేలు వరకూ పెట్టుబడి పెట్టారు. ఆముదం విత్తనాలు నాటిన 22 రోజులైనా మొలకెత్తలేదు. దీంతో బాధిత రైతు డీలర్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా కంపెనీకి చెందిన ప్రతినిధులు దగ్గరికి వెళ్లి అడగండి..నేను ఏమి తయారు చేయలేదు కదా అంటూ సమాధానం చెప్పాడు. దీంతో మోసపోయాయని తెలుసుకుని వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. దీనిపై వ్యవసాయాధికారి అహమ్మద్‌బాషాను వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని, డీలర్, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి..నకిలీ విత్తనాలు అని తెలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈఓఆర్‌డీ సేవలు ఎనలేనివి

ఉరవకొండ: ఉరవకొండ ఈఓఆర్‌డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దామోదర్‌రెడ్డి సేవలు ఎనలేనివని ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు అన్నారు. ఈఓఆర్‌డీ ఆత్మకూరుకు బదిలీ కావడంతో ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెన్నహోబిళం మాజీ చైర్మన్ అశోక్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, ఎంపీడీఓ చంద్రమౌళి, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వశికేరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో ఉపాధి పనులు

విడపనకల్లు: గుంతకల్లు బ్రాంచి కెనాల్(జీబీసీ) ఆరో డిస్ట్రిబ్యూటరీలో ఉపాధి పథకం కింద పూడికతీత, ముళ్ల పొదలు తొలగించే పనులు చేపట్టారు. ఆరో డిస్ట్రిబ్యూటరీ ప్రారంభం విడపనకల్లు నుంచి డొనేకల్లు వరకూ పనులు చేయనున్నారు. ఆరో డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కింద దాదాపు 3,000 ఎకరాల ఆయకట్టు ఉందని, కాలువలో పూడిక, ముళ్ల పొదలు ఉండటం వల్ల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని జెడ్పీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్ కురుబ రమేష్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, దేశాయ్ సిద్ధార్థ, పీసీ కమిటీ చైర్మన్ కురుబ గిరిబాబు తదితరులు మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసికెళ్లారు. ఆయన వెంటనే ఉపాధి అధికారులతో మాట్లాడి జీబీసీకి సాగునీరు వచ్చేలోపు కాలువలో పెరిగిన ముళ్ల పొదలు, పూడికతీత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ప్రారంభం కావడంతో రైతులు, నాయకులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యతలో మేటి 'భారతి సిమెంట్'


మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ సిబ్బంది

బొమ్మనహాళ్: సిమెంట్ తయారీ రంగంలో భారతి సిమెంట్ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో బసవేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ఇతర సిమెంట్లతో పోల్చుకుంటే భారతి సిమెంట్ మూడు రెట్లు మెరుగ్గా పనిచేస్తుందన్నారు. అందువల్లే వినియోగదారులు మొగ్గు చూపుతున్నారన్నారు. రోబోటిక్ క్వాలిటీ, జర్మనీ టెక్నాలజీ, టాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్ వంటి అత్యున్నత ప్రమాణాలతో భారతి సిమెంట్‌ను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీలర్లు రంగనాథ్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన


పెద్ద కొట్టాలపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

విడపనకల్లు: మండలంలోని పెద్ద కొట్టాలపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అతిసారం నియంత్రణ, పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డయేరియా వ్యాధి సోకిన పిల్లలకు తప్పనిసరిగా 14 రోజుల పాటు జింక్ అందించాలని వైద్యులు సూచించారు. అనంతరం డయేరియా సంబంధించిన పోస్టర్లును విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపాల్ నాయక్, నాగశంకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కూడేరు: కలుషితమైన తాగునీటిని తాగడం ద్వారా అతిసార వ్యాధి బారిన పడాల్సి వస్తుందని మండల వైద్యాధికారి సరిత అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ప్రజలకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అతిసారం బారినపడ్డ వారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌బాబు, సూపర్‌వైజర్ రవీంద్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట క్రాస్ వద్ద అయ్యప్పనగర్‌లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని మల్లికేతి గ్రామంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి మంగళవారం తెలిపారు. అధికారులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతులకు అందుబాటులో విత్తనాలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అందుబాటులో పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వేరుశనగ పంటకు సంబంధించి టీసీజీఎస్–1694, కదిరి లేపాక్షి, కే9, కదిరి అమరావతి రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కిలో రూ.120 ధర నిర్ణయించామన్నారు. అలాగే పెసర విత్తనాలు కిలో రూ.125, మినుము విత్తనాలు కిలో రూ.125గా నిర్ణయించామన్నారు. కావాల్సిన రైతులు కళ్యాణదుర్గం కేవీకే నందు ఫార్మ్ మేనేజర్- 8919099476, సమన్వయకర్త- 7702544492 నంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే ఉద్యాన పంటలైన టమాట, మిరప, బంతి నారు పోసి విక్రయిస్తామన్నారు. వీటితో పాటు గడ్డిజాతి విత్తనాలు సీఓఎఫ్‌ఎస్–4 కిలో రూ.400, హెడ్జ్‌లుసర్న్ విత్తనాలు కిలో రూ.600, స్టైలో రకం గడ్డి విత్తనాలు రూ.100 చొప్పున అందుబాటులో ఉంచామని ఆమె తెలిపారు.

ముగిసిన టైలరింగ్ శిక్షణ తరగతులు

కుందుర్పి: ఎస్‌కే చారిటబుల్ ట్రస్ట్, అభయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మహిళలకు దాదాపు మూడున్నర నెలలుగా కుట్టు మిషన్ శిక్షణ (టైలరింగ్) లో నైపుణ్యం పొందిన 36మంది మహిళలకు అభినందన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్కే చారిటబుల ట్రస్ట్ వ్యవస్థపకుడు లెనిన్ బాబు, సొసైటీ అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, జానపద గాయకుడు లక్ష్మణమూర్తి మాట్లాడుతూ టైలరింగ్ లో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రామూర్తి, ఈరన్న , శిక్షకురాలు అంబుజా, కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బొమ్మలింగ, రఘువీర, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

వజ్రకరూరు: విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని గ్రంథాలయ అధికారి మునెమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 30వరోజు సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సంరద్భంగా విద్యార్థులతో డ్రాయింగ్, బుక్‌రీడింగ్,కథలు చెప్పించడం, క్యారమ్స్, చెస్ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

'నైట్ డ్యూటీలు చేయించకూడదు'

వజ్రకరూరు: మండలంలోని గడేహోతురు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలచే నైట్ డ్యూటీలు చేయించకూడదని ఆశాకార్యకర్తల యూనియన్‌జిల్లా కార్యదర్శి నాగమణి, సీఐటీయూ నాయకులు రంగారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం గడేహోతురు ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారి పద్మాను కలసి వారు వినతిపత్రం అందచేశారు.

వైద్యశాఖలో ముగ్గురు బాధ్యతల స్వీకరణ

కూడేరు: వైద్యశాఖ సూపర్‌వైజర్‌గా యశోద మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న దేవకర్ణమ్మ నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ల్యాబ్ టెక్నీషియన్‌గా వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉన్న ల్యాబ్ టెక్నీషయన్ గార్లదిన్నె పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. ఫార్మసిస్టుగా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న ఫార్మసిస్టు కుళ్లాయిబాబు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తామన్నారు.